రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, జూన్ 27: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం శనివారం నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఆర్‌హెచ్ కంపెనీ, ఐటీ టవర్ నిజామాబాద్ వారు టెలికాలర్ ఉద్యోగాల కోసం మేళాను నిర్వహిస్తున్నారన్నారు. డిగ్రీ పాసై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మాట్లాడే పురుషులు మాత్రమే బయోడేటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫొటోతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీఈఈసెట్-2024కు

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 27: జిల్లాలోని డీఈఎల్ఈడి (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్), డీపీఎస్ఇ (డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) అభ్యర్థుల డిఈఈసెట్-2024 ప్రభుత్వ డైట్ కళాశాల మరియు ప్రైవేటు అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్స్ ఎడ్యుకేషన్ ఇన్ స్టిట్యూషన్ రెండు సంవత్సరాల కోర్సు కొరకు ఆన్‌లైన్ ద్వారా దర ఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30 వర కు స్వీకరించడం జరుగుతుందని దరఖాస్తుల ఎడిట్ ఆప్షన్ 29, 30తేదీ వరకు ఇవ్వడం జరిగిందని పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో జూలై 10వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను డిఈఈసెట్.సిడిఎస్ఇ.తెలంగాణ.జివొవి.ఇన్ వెబ్‌సైట్‌లో చేయాలన్నారు.



కార్తిక్‌నాయక్‌ను సన్మానిస్తున్న వివేక్‌నగర్ తండా గ్రామస్థులు

అవార్డు గ్రహీతకు సన్మానం

- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అవార్డు గ్రహీతను సన్మానించిన వివేక్‌నగర్ తండా వాసులు

జక్రాన్‌పల్లి, జూన్ 27: కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం-2024 అవార్డు గ్రహీత, యువకవి రమేష్ కార్తిక్‌నాయక్‌ను బంజారా నాయకులు సన్మానించారు. గురువారం వివేకనగర్ తండాలో కార్తిక్ నాయక్‌ను బంజార జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారచంద్ నాయక్ ఆధ్వర్యంలో కార్తిక్‌నాయక్‌ను శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. రమేష్ కార్తిక్ నాయక్‌ను నాలుగు కిత పుస్తకాలు రాశారని, ఇందులో 2018లో బయలు దేరు బండి, 2021లో డావ్‌ల, 2022లో కేసుల, 2023లో చెకుమాకు తదితర పుస్తకాలు రాశారని గుర్తుచేశారు. డావ్‌ల కవిత పుస్తకం రాసిన కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం 2024 అవార్డు యువకవి రమేష్‌కార్తిక్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో బంజార నాయకులు గంగాధర్‌నాయక్, విఠల్‌రాథోడ్, రాజు సదర్‌నాయక్, జితేందర్‌నాయక్, రాంసింగ్, రాములు నాయక్, మోజిరాం, పాల్గొన్నారు.

అర్గుల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో..

మండలంలోని అర్గుల్ సింగిల్ విండో కార్యాలయంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార అవార్డు గ్రహీత యువకవి రమేష్ కార్తిక్ నాయక్‌ను అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, విండో పాలకవర్గ సభ్యులు శాలువ, పూలమాల, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో తిరుపతిరెడ్డి, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్ కాలేజీలు వెలవెల!

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏటా తగ్గుతున్న ప్రవేశాల సంఖ్య





- సర్కారు కాలేజీలపై ఆసక్తి చూపని జిల్లా విద్యార్థులు
- విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులైనా ప్రవేశాలు అంతంతే
- ప్రభుత్వ కళాశాలల్లో వేధిస్తున్న ఖాళీల బెడద
- నిధుల కొరతతో భారంగా నిర్వహణ

నిజామాబాద్ అర్బన్, జూన్ 27: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల కోసం ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. జిల్లాలో రోజురోజుకూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండగా సమస్యలతో ఉన్న ప్రభుత్వ కళాశాలలవైపు చూసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు రోజురోజుకూ తమ ప్రాభవ్యాన్ని కోల్పోతున్నాయి. గతంలో ప్రభుత్వ కళాశాలలంటే ఆసక్తి చూపే విద్యార్థులు ప్రస్తుతం అటువైపు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో వసతుల లేమి, లెక్చరర్ల కొరతతో గతంలో ప్రభుత్వ కళాశాలల్లో సీటు దొరకాలంటే కష్టపడే పరిస్థితి నుంచి ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని బతిమిలాడే పరిస్థితి ఉంది. విద్యాసంవత్సరం ప్రారంభమై సుమారు నెలరోజులు గడుస్తున్నా జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే లెక్చరర్లు, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు అడ్మిషన్లపై సరైన దృష్టి పెట్టకపోవడం ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న వసతులపై ప్రచారం నిర్వహించకపోవడం వల్లే అడ్మిషన్లు తగ్గినట్లు విమర్శలు వస్తున్నాయి. ఉచిత పుస్తకాలు, ఉచిత చదువు, ఇతర సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ కళాశాలలవైపు విద్యార్థులు చూడటం లేదంటే ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో అనేక లోపాలు ఉన్నట్లు అర్థమవుతోంది. ఇంటర్ విద్యాశాఖపై ఉన్నతాధికారుల సమీక్షలు లేకపోవడం జిల్లా స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడానికి కారణంగా చెప్పవచ్చు. ఆర్థిక పరిస్థితులు బాగులేక తప్పని పరిస్థితుల్లో చదువును మధ్యలోనే ఆపివేయలేని దీన పరిస్థితుల్లో ఉన్నవారు తప్ప ఎవరు కూడా ప్రభుత్వ కళాశాలల వైపు చూడటం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం కూడా అడ్మిషన్లు జరగకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం రోజురోజుకు తగ్గుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల వైపు ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం.

వేధిస్తున్న బోధన సిబ్బంది కొరత..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన సిబ్బంది కొరత విద్యార్థుల చేరికలపై ప్రభావం చూపుతోంది. ప్రైవేటు కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నా విద్యార్థులకు సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో సరైన బోధన జరగడం లేదు. దీని ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై పడుతోంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉత్తీర్ణత శాతం రోజురోజుకు పడిపోతుంది. మండల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద విద్యార్థులు తప్ప.. ఎవరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించిన వారు కూడా తగినంత లేకపోవడంతో బోధన ఇబ్బందిగా మారుతోంది. గెస్ట్ లెక్చరర్లను సైతం కొనసాగించేందుకు ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధన అనుకున్న విధంగా జరగడం లేదు.

అరకొర నిధులతో ఇబ్బందులు..

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి అరకొర నిధులు మాత్రమే వస్తున్నాయి. కళాశాలలను శుభ్రం చేసేందుకు, తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోంది. కళాశాలల్లో కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి నిర్వహణ సక్రమంగా ఉండటం లేదు. కళాశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలల్లో డస్టర్లు, చాక్‌పీస్‌లు, రిజిస్టర్లు, తదితర చిన్న చిన్న అవసరాలకు కూడా నిధులు లేక ప్రిన్సిపాళ్లు తమ జీతాల నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఆరు నెలలకొకసారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి రూ.25 చొప్పున కళాశాలల నిర్వహణకు నిధులు విడుదల చేస్తుంది. కానీ అవి ఎప్పుడు విడుదల అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి..

: రవికుమార్, డీఐఈవో

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నాం. ఉచితంగా పుస్తకాలు ఇవ్వడంతో పాటు ఉచిత బోధన వసతులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఇటీవలే కళాశాలలు ప్రారంభమయ్యాయి. మరికొన్ని రోజుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గుతోంది. జిల్లాలోని 15 జూనియర్ కళాశాలల్లో 2021-22 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 3768 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 3435 మంది విద్యార్థులు చదివారు. గత విద్యాసంవత్సరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 3679 మంది విద్యార్థులు చదువగా ద్వితీయ సంవత్సరంలో 3000 మంది వరకు విద్యార్థులు చదివారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. కేవలం మొదటి సంవత్సరంలో 2500 మంది మాత్రమే అడ్మిషన్లు పొందినట్లు తెలుస్తోంది. ఈ విద్యాసంవత్సరం ఇప్పటి వరకు వెయ్యిలోపే విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు సమాచారం.



- తొండాకూర్, కుద్వాన్‌పూర్ గ్రామాల మధ్య నూతన బ్రిడ్జి



- వరద ఉధృతికి కోతకు గురైన తొండాకూర్-కుద్వాన్‌పూర్ బీటీ రోడ్డు (ఫైల్)

తొండాకూర్-కుద్వాన్‌పూర్‌కు

రాకపోకలు షురూ

- గత ఏడాది భారీ వర్షానికి కొట్టుకుపోయిన బీటీ రోడ్డు
- రహదారి మధ్య నీరు నిలిచి.. గ్రామాలకు రాకపోకలు బంద్
- బ్రిడ్జి నిర్మాణంతో వాహనాల రాకపోకల పునరుద్ధరణ
- సంతోషం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

డొంకేశ్వర్, జూన్ 27: మండలంలోని తొండాకూర్-కుద్వాన్‌పూర్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. మండలంలోని పలు గ్రామాల ప్రజలు తొండాకూర్ మీదుగా కుద్వాన్‌పూర్ వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. తొండాకూర్ నుంచి కుద్వాన్‌పూర్ వెళ్లే రహదారి గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయి కుంటలాగా మారింది. కోతకు గురైన రోడ్డు సమీపంలో పంట పొలాల్లో భారీగా నీరు ఇసుక మేటలు వేసింది. దీంతో సుమారు 150 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే ఓ యువకుడు తన ద్విచక్ర వాహనంపై షాపూర్ నుంచి తొండాకూర్ మీదుగా కుద్వాన్‌పూర్ వెళ్తున్న సమయంలో తొండాకూర్, కుద్వాన్‌పూర్ గ్రామానికి మధ్య కోతకు గురైన రోడ్డును గమనించక పెద్ద గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. ఏటా వానాకాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలని వినతి పత్రం అందించారు. దీంతో అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం రూ.2కోట్ల 30లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించింది. సుమారు ఆరు నెలలుగా బ్రిడ్జి నిర్మాణం పనులు జరిగాయి. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఆరు ఫీట్ల ఎత్తు చేసి బ్రిడ్జి నుంచి వంద మీటర్ల వరకు అప్రోచ్ రోడ్డు వేసే పనులను మిగిలి ఉన్నాయి. నెల రోజుల్లో ఆ పనులను కూడా పూర్తి చేస్తామని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వానాలు ఊపందుకోక ముందే బ్రిడ్జి పనులు పూర్తి చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, తొండాకూర్-కుద్వాన్‌పూర్ రహదారి ప్రమాదాలపై గతంలోనే 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

బ్రిడ్జి నిర్మాణంతో సంతోషంగా ఉంది..

: వైఎస్ గంగాధర్, తొండాకూర్

బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలు వర్షాలతో రోడ్డంతా కొట్టుకుపోవడంతో ప్రయాణం చేయాలంటే ఇబ్బంది ఉండేది. బ్రిడ్జి ఏర్పాటుతో ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయవచ్చు. భారీగా వర్షాలు పడకముందే మిగతా రోడ్డు పనులను పూర్తిచేసి ప్రయాణానికి ఆటం కం కలగకుండా చూడాలి.

త్వరలో మొత్తం పనులు పూర్తి..

: రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ

నెల రోజుల్లో రోడ్డు పనులు మొత్తం పూర్తి చేస్తాం. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు వేసే పని ఉంది. వర్షాలు ప్రారంభం కాకముందే అప్రోచ్ రోడ్డు పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం.



జాతీయ రహదారి పనులు ప్రారంభం

- మెదక్ -రుద్రూరు జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం
- రూ.899 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు
- హవేళి ఘన్‌పూర్ నుంచి పనులు మొదలు



హవేళి ఘన్‌పూర్ వద్ద చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 27: హైదరాబాద్-మెదక్-బాన్సువాడ (హెచ్‌ఎంబీ) జాతీయ రహదారి 765-డి మెదక్-రుద్రూరు మధ్య జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 2022లో ఈ రహదారిని జాతీయ రహదారిగా మారుస్తూ 899 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. 2024 మార్చి 5న పటాన్ చెరువులో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని వర్చువల్‌గా విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి మెదక్ వరకు విస్తరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా నిజామాబాద్ జిల్లా రుద్రూరు వరకు ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీల ద్వారా రోడ్డు విస్తరణ పనులను జరపనున్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎల్లారెడ్డి వరకు సుమారు 43.91కిలో మీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించడానికి రూ.399 కోట్లు, ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు సుమారు 51.66 కిలో మీటర్ల పొడవు రహదారి విస్తరణ పనుల కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటగా మెదక్-ఎల్లారెడ్డి ప్యాకేజీ జాతీయ రహదారి నిర్మాణం పనులు హవేళి ఘన్‌పూర్ మండల కేంద్రం నుంచి ప్రారంభమయ్యాయి.

మెదక్-నర్సపూర్ ప్యాకేజీల ద్వారా రహదారి పనులు

మెదక్ నుంచి రుద్రూరు వరకు రెండు ప్యాకేజీల ద్వారా జాతీయ రహదారి విస్తరణ పనులు జరగనున్నాయి. మెదక్ నుంచి నాగిరెడ్డిపేట మండలం మీదుగా ఎల్లారెడ్డి వరకు ఒక ప్యాకేజీగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. అలాగే ఎల్లారెడ్డి నుంచి బొగ్గు గుడిసే చౌరస్తా, మహ్మద్‌నగర్, బాన్సువాడ పట్టణం మీదుగా రుద్రూరు వరకు మరో ప్యాకేజీ ద్వారా జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం మెదక్-ఎల్లారెడ్డి ప్యాకేజీ రహదారి నిర్మాణం పనులు మొదలయ్యాయి.

ప్రధాని మోదీ శంకుస్థాపనతో మొదలైన పనులు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపనతో మెదక్-రుద్రూరు 765-డి జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశాక, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి భారతీయ జనతా పార్టీ మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి రావడం, నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడంతో ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభమయ్యాయి.

వంద ఫీట్లతో రహదారి విస్తరణ

మెదక్-రుద్రూరు జాతీయ రహదారి రెండు వరుసల విస్తరణ పనులు 150 ఫీట్లతో చేస్తారనే ప్రచారం మొదట్లో జరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ రహదారి గుండా నాగిరెడ్డిపేట, మహ్మద్ నగర్, నసురుల్లాబాద్, వర్ని, రుద్రూరు మండల కేంద్రాలతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ కేంద్రాలు ఉన్నాయి. ఈ మండల, డివిజన్ కేంద్రాల మీదుగా రహదారి విస్తరణ పనులు జరగాల్సి ఉంది. దీంతో మండల కేంద్రాల, డివిజన్ కేంద్రాల రహదారి ఇరు పక్కలా ఉన్న భవనాలు, ఇళ్ల యజమానులు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం ఎట్టకేలకు రహదారి విస్తరణ పనులు వంద ఫీట్లతో చేపట్టాలని నిర్ణయించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి మధ్యలోనుంచి ఇరు పక్కల 50 ఫీట్లతో రహదారి విస్తరణ పనులు జరగనున్నాయి.

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

డిచ్‌పల్లి,జూన్ 27: మండలంలోని మెంట్రాజ్‌పల్లి 246 సర్వే నంబర్‌లో గత కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిని కొందరు కబ్జాకు ప్రయత్నాలు చేస్తు న్నారని రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు మండల అధికారులు వారికి సహకరించడం సరికాదన్నారు. ఆ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండానే తమ భూ ములు సర్వేయర్ సర్వేలు నిర్వహిస్తున్నరని బాధితులు సుప్రియ, సావిత్రి, సాయిలు, లక్ష్మీ,గంగామణి, పోసాని, శాంత, రాజమని పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

బంద్ పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దు : సీఐ

బోధన్‌రూరల్, జూన్ 27: పాఠశాలలు, కళాశాలల బంద్ పేరిట వి ద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించవద్దని పట్టణ సీఐ వీరయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చదివిస్తున్నారని పేర్కొన్నా రు. విద్యార్థుల విలువైన సమయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు రోడ్లపైకి తీసుకువచ్చి ధర్నాలు చేయించడం, పాఠశాలలు, కళాశాలల ను బంద్ చేయించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరి యస్‌గా ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్కూ ల్ వద్దకు ఎవరైనా బలవంతంగా వచ్చి ఇబ్బందులు కలిగిస్తే వారిపై తమకు సమాచారం ఇవ్వాలని, కఠినచర్యలు తీసుకుంటామని తెలిపా రు. ఎవరైనా బలవంతంగా విద్యాసంస్థలను మూయించాలని చూస్తే కఠినచర్యలు తప్పవన్నారు. స్కూళ్లు, కాలేజీల యాజమాన్యం వారే మూసివేస్తే ఫర్వాలేదు. కాని ఎవరైనా బలవంతంగా మూసివేయించా లని చూస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్‌లో అవినీతిపై కమిషనర్‌కు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, జూన్27: మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని గురువారం కమిషనర్ రాజుకు బీజేపీ నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత పాలకవర్గం 2023లో మొరం మట్టి వేసినట్టు రూ.25లక్షలు అక్రమంగా రికార్డు చేశారని, మోటర్ పంప్ సెట్‌ల రిపేర్‌ల పేరు మీద నాలుగు శాతం కమిషన్‌తో కోట్ల రూపా యల అవినీతి జరిగిందని, చెత్త సేకరణ కొరకై నాణ్యత లేని ఆటో ట్రాలీలు కొనుగోలు చేశారని, అక్రమ లే అవుట్‌లు చేశారని, అలాగే ప్రభుత్వ ఇరిగేషన్ స్థలాలతో పాటు అసైన్‌మెంట్ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు జరుగకుండా ఇంటినెంబర్‌లు కేటాయించారని, వీటిపై విజి లెన్స్ విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమం లో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, గుర్రం విజయానంద్, కలిగోట ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి ఫౌండేషన్‌ను సందర్శించిన న్యాయాధికారి

కోటగిరి,జూన్27: మండల కేంద్రంలోని గుమ్మడి ఫౌండేషన్ బా య్స్ హోమ్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సి విల్ న్యాయాధికారి పద్మావతి గురువారం సందర్శించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి గు మ్మడి ఫౌండేషన్ పేరును నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గుమ్మడి ఫౌండేషన్ నిర్మాతలు గుమ్మడి శ్రీధర్, గుమ్మ డి సుచిత్ర, మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనచోదకులకు జరిమానాలు

డిచ్‌పల్లి, జూన్ 27 :పోలీసులకు చిక్కకుండా ఎటువంటి ధృవ పత్రాలు గానీ డ్రైవింగ్ లైసెన్స్ లు లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనచోదకులను పట్టుకొని పోలీసులు జరిమానాలు విధించారు. గురువారం డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేం ద్రంలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 100వాహనాలను పట్టుకొని రాణాకు తరలించారు. ఆర్టీఏ అధికారులు అందుకు అనుగుణంగా జరిమానాలు విధించారు.

గొర్రెల కాపారి మృతి

జక్రాన్‌పల్లి, జూన్ 27: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ముక్కెర గంగమల్లు(50) గొర్రెల కాపారి మృతిచెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. గురువారం సాయంత్రం అర్గుల్ గ్రామ శివారులోని కకరకాయల సంతోష్ పొలంలో ముక్కెర గంగమల్లు గొర్లు కాస్తుండగా చనిపోయి పడి ఉన్నాడని, గుండెపోటు వచ్చి ఉండ వచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలి'

మెండోర, జూన్27: రామగుండంలోని జెన్‌కో విద్యుత్ కేంద్రం స్థలా న్ని సింగరేణి కేటాయించి అందులో కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మిం చడానికి నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని.. దానిని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని యూనియన్ నాయ కుడు రఫీక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యాన్ని నిరసిస్తూ పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జెఏసీ ఆధ్వర్యంలో ఎస్‌ఈ శ్రీనివాస్‌కు విద్యుత్ ఉద్యోగులు వినతిపత్రం అం దజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ స్థలంలో జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసీ నాయకులు సతీష్, భరత్, శ్రీనివాస్, విద్యుత్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో తైబజార్ వేలం రేపటికి వాయిదా

కమ్మర్‌పల్లి, జూన్ 27: మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన తైబజార్ వేలంలో నిర్ణీత టార్గెట్ రానందున శుక్రవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ వెల్ల డించారు. గురువారం తైబజర్ వేలం నిర్వహించగా అనుకున్న విధంగా (లక్షా88వేలు) టార్గెట్ రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్ తెలిపారు. రెండు సం వత్సరాలు వరుసగా లక్షా 5 వేలు, లక్షా 16 వేల వేలం జరుగగా ఈసారి నిర్ణీత ప్రైజ్‌మని లక్షా 88 వేలు ఖరారు చేయగా కేవలం లక్ష రూపాయలకే వేలం పాట ఆగిపోవడంతో రేపటికి వాయిదా వేసినట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెంది న నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, మాజీ ఉప సర్పంచ్ పాలెపు గంగారాం, గ్రామస్తులు మార్కండేయులు, బాబూరావు, పాలెపు రాజేశ్వర్ పంచాయతీ సిబ్బం ది, పాల్గొన్నారు.

ఇతిహాస సంకలన సమితి నూతన కమిటీ ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:అఖిల భారతీయ సంస్థ ఇతిహాస సంకలన సమితి జిల్లా నూతన కమిటీ ఎన్నిక గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. సంస్థ సీనియర్ సభ్యుడైన కందకుర్తి యాదవరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేష్‌కుమార్, సంర క్షకుడిగా యాదవరావు, తాటివీరేశం, కార్యదర్శులుగా చిలుముల మోహన్‌దాస్, గౌరవ సలహాదారులుగా అంజనేయులు, ఉపాధ్యక్షు రాలిగా శైలిబెల్లాల్, ప్రధాన కార్యదర్శిగా కందకుర్తి ఆనంద్, కార్యదర్శిగా భూపతి, కోశాధికారి సాయిరెడ్డి, మహిళా ప్రముఖ్‌గా రాధా, సంపర్క ప్రముఖ్‌గా నర్సింహ, ఈసీ మెంబర్లుగా వెంకటమల్లయ్య, నవీన్, సురేష్, దయానంద్, జయకృష్ణ, నిఖిలేష్, ప్రవీణ్‌లు నియమితు లయ్యారు.

'కబ్జాదారుల నుంచి రక్షించండి '

ఆర్మూర్‌టౌన్ , జూన్27: నందిపేట గ్రామ పొలిమేరల్లో తమ ప్లాట్లను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారి నుంచి తమ భూ ములను రక్షించాలని లబ్ధిదారులతో కలిసి ఆల్ ఇండియా అంబేద్కర్ సం ఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్ కోరారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో వారు మాట్లాడుతూ 2004లో రాష్ట్ర ప్రభుత్వం 630/1 గల సర్వేనెంబర్‌లో పట్టాలను జారీ చేసిందని అందులో గుడిసెలు వేసు కుంటున్న తరుణంలో అక్కడే ఉన్న కొందరు భూకబ్జాదారులు తీవ్ర ఇబ్బం దులకు గురి చేస్తూ వేసిన గుడిసెలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశా రు. గతంలో జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని, అధికారుల విచారణ అనంతరం లబ్ధిదారులకే చెందాలని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ కబ్జా చేస్తున్న విషయమై నందిపేట ఎస్సై, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు తస్నీరు గంగామణి, సురేఖ, ధనలక్ష్మీ, వాణి వెంకటేష్, లలిత, లక్ష్మీ, నికత్‌పర్వీన్‌బేగం, అహ్మద్‌బీ, హఫీస్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

150 కిలోల ప్లాస్టిక్ సీజ్

ఆర్మూర్‌టౌన్, జూన్27: మున్సిపల్ పరిధిలోని పలు షాప్‌లలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి 150కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. పర్యవరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించిన పలు షాప్‌లలో ప్లాస్టిక్ వాడ డంపై అధికారులు షాప్ యాజమానులకు నోటీసులు జారీ చేస్తూ, ప్లాస్టిక్ ను సీజ్ చేసినట్టు పర్యవరక్షణ ఇంజనీర్ పూర్ణమౌళి తెలిపారు. ఈ కార్యక్ర మంలో సానిటరీ జవాన్ రాజన్న, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, రవి, ప్రశాంత్; తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

జక్రాన్‌పల్లి, జూన్27: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన మార్గం గౌతమిబ(25) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో మార్గం గౌతమి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మార్గం గౌతమి గతకొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుందని, బాధ భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో గౌతమి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకుందని తెలిపారు. ఆమె భర్త బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి నెల రోజుల క్రితం భర్త చిన్నబాలరాజు గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడని తెలిపారు. మృతురాలికి మూడేళ్ళ కొడుకు ఉన్నారన్నారు. సంఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై సిహెచ్.తిరుపతి, తహసీల్దార్ కిరణ్మాయి పరిశీలించి పంచనామా నిర్వహించారని తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అరెస్టుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:ఏబీవీపీ నిర్వహించిన విద్యాసంస్థల బంద్ సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీ యకార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస తులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏబీ వీపీ బంద్ పిలుపునివ్వడం జరిగిందని జిల్లాలో మాత్రం రాష్ట్రంలో ఎక్క డాలేని విధంగా పోలీసులు అత్యుత్సాహంతో ఏబీవీపీ నాయకులపై అక్రమం గా కేసులు నమోదు చేశారని అన్నారు. సీపీ ప్రైవేటు విద్యాసంస్థలకు మద్దతు తెలుపుతూ ఏబీవీపీ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికా దని, దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే కేసులను తొలగించాలని డిమాం డ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశి, సునీల్, జగదీశ్, దుర్గాదాస్, ప్రవీణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలి'

రెంజల్,జూన్27: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎం పీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు అం బేద్కర్ నగర్, బోర్గాం, మౌలాలి తండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పాఠశా లలో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను వేసిందన్నారు.ఈ కమిటీల ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీరా జ్ ఏఈ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సునీల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కార్తిక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రూరు, జూన్ 27 : పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.7,910 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైన పేకాట ఆడినట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మాక్లూర్: కొత్తపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేర కు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి రూ.10వేల300 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సుదీర్‌రావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం'

బోధన్‌రూరల్,జూన్27: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమ ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్ అన్నారు. గురువా రం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలే దని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రు ణమాఫీ హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రైతుల సంక్షేమం కోసం రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్ష పాతి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికా ంత్ చారి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసోద్దీన్, శరత్ రెడ్డి, చిరంజీవి, తలా రి నవీన్, కలీం, గోపాల్ రెడ్డి, సంగ్రామ్, బోధన్ సొసైటీ చైర్మన్ ఉద్మీర్ ల క్ష్మణ్, వీరభద్రరావు, రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, జూన్ 27:ధన్‌పాల్ లక్ష్మిబాయి-విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం నగరంలోని కోటగల్లి శంకర్‌భవన్, దుబ్బ ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో తన ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు పం పిణీ చేయడం జరిగిందన్నారు. గత 20 ఏళ్లుగా తన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, నిజామాబాద్ అర్బన్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం అం దించాలన్నదే తన లక్ష్యమన్నారు. గతంలో హామీ మేరకు దుబ్బ పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు, ఫర్నిచర్ అందజేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

డిచ్‌పల్లి,జూన్ 27: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరు ఆహారమే ఔషదంగా మార్చుకోవాలని ప్రకృతిలో లభ్యమయ్యే పచ్చి ఆహారం, మొలకలు తీసుకోవాలని పూణేకు చెందిన మాతాజీ నిర్మాలదేవి యోగా గురువు కరణ్ అన్నారు. గురువారం తెలంగాణ విశ్వవిద్యాలయంలోని కామర్స్ సెమినార్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేరటర్ ప్రొ.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా ప్రొ. యాదగిరి హాజరయ్యారు. యోగా గురువు కరణ్ మాట్లాడుతూ.. మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

ఎడపల్లి, జూన్ 27: మండలంలోని అంబం గ్రామంలో గల ఊర చెరువులో గురువారం చేపల వేటకు వెళ్లి రఘుపతి శ్రీనివాస్ అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రఘుపతి శ్రీనివాస్ (35) అనే వ్యక్తి తన కులస్థులతో కలిసి గ్రామంలోని ఊరచెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల తన కాళ్ళకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. అక్కడే వున్న వారు అతనిని కాపాడడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని, మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

సిరికొండ జూన్ 27 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కామదేను జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ లక్ష్మీనర్సయ్య మెమోంటోలను అందజేసి సన్మానించారు. కళాశాలకు చెందిన నవీన, అక్షయ రాష్ట్రస్థాయిలో ఏడు ర్యాంకులు సాధించినందున వారిని కళాశాలలో మెమోంటోలను అందజేసి ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్రస్థాయి 13వ ర్యాంకు సాధించిన విజయ, శ్రీజా, జ్యోత్స్నలను కూడా అభినందించారు. నరేంద్ర గ్రూప్ ఆఫ్ ఇన్స్టూషన్స్ చైర్మన్ శంకర్ సైతం విద్యార్థులను సన్మానించారు.

విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కావద్దు

మోపాల్, జూన్ 27: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని విద్యార్థులకు ఏఎస్సై రమేష్ సూచించారు. గురువారం మోపాల్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల తో గ్రామాల్లో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కావద్దని సూచించారు. ఎంతో మంది వీటికి అలవాటు పడి జీవితాలను నాశ నం చేసుకుంటున్నారని అన్నారు.

క్రీడా పాఠశాల కోసం విద్యార్థుల ఎంపికలు పూర్తి

సుభాష్‌నగర్, జూన్ 27: తెలంగాణ క్రీడాపాఠశాల ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్‌లలో నాల్గోతరగతిలో ప్రవేశాల కోసం ఎంపికలను నిర్వహించినట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. నగరంలోని నాగారం స్టేడియంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. నాల్గోతరగతి ప్రవేశాల కోసం బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 9 మంది మొత్తం 25 మంది క్రీడాకా రులు పాల్గొన్నారని తెలిపారు. వీరికి శారీరక, ధారుడ్య పరీక్షలు పలు అంశాలలో క్రీడాపోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

మిట్టాపూర్ రైలు పట్టాల సమీపంలో మృతదేహం లభ్యం

నవీపేట, జూన్27: మండలంలోని మిట్టాపూర్ సమీపంలో రైలుపట్టాల వద్ద గుర్తుతెలియని సుమారు 55 సంవత్సరాల వయసు వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైనందని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడు తెలుపు రంగు దోవతి, తెలుపు రంగు ఫుల్ షర్ట్‌ను ధరించి ఉన్నాడని, అతడు చనిపోయి సుమారు ఆరు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి అతడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి పురుగులు పట్టి ఉందని అన్నారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా దాసరి మూర్తి

మెండోర, జూన్27: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా దాసరిమూర్తిని నియమించినట్టు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు దాసరిమూర్తికి నియామక పత్రాన్ని అందజేశారు.

'బొజ్జతారకం నేటి సమాజానికి స్ఫూర్తి కావాలి'

పెద్దబజార్, జూన్ 27: ప్రజల పక్షపాతి, హేతువాది బొజ్జ తారకం నేటి సమాజానికి స్ఫూర్తి కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాల మహానాడు నగర అధ్యక్షుడు ధన్‌రాజ్‌లు అన్నారు. గురువారం నగరంలోని శ్రామిక విజ్ఞాన కేంద్రం వద్ద బొజ్జతారకం 85వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జ తారకం దళితుల పట్ల వివక్షత రెండు గ్లాసుల నీళ్ల పద్ధతికి వ్యతిరేకంగా అనేక గ్రామాలు తిరిగి ఉద్యమాలు చేశారని, జిల్లాలో అంబేద్కర్ యువజన సంఘాల నిర్మాణం, హక్కుల ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని నాయకుడిగా, మంచి రచయితగా జిల్లాలో పేరు పొందారని అన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

మెండోర, జూన్27: మండలంలోని బుస్సాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముప్కాల్‌లోని పాండు రంగ బుక్‌డిపో వారు నోట్‌పుస్తకాలు, ఇంగ్లీష్, తెలుగు రాత బుక్‌లను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు శమంత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుక్‌డిపో రామరాజ్ ఉమేష్‌లకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను వినియోగంలోకి తెస్తాం

● అదనపు కలెక్టర్ అంకిత్ ● యార్డ్ పరిశీలన

ఎడపల్లి, జూన్ 27: మండల కేంద్రంలో రూర్బన్‌పథకం ద్వారా నిర్మించిన మాడ్రన్ డంపింగ్ యార్డును వినియోగంలోకి తెస్తామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో రూర్బన్ పథకం ద్వారా నిర్మించిన మాడ్రన్ డంపింగ్ యార్డును గురువారం ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ఎందుకు ఉపయోగించలేదని ఆయన అధికారులను నిలదీశారు. మాడ్రన్ డంపింగ్ యార్డును గ్రామ సంఘంనకు అప్పగించి వారి ద్వారా ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి డంపింగ్ యార్డులో ప్రెస్‌చేసి కాటన్‌గా తయారు చేసి ఖర్మాగారాలకు పంపించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ సాయాగౌడ్, ఎంపీ డీవో శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగ



మాడ్రన్ డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

రాజు గౌడ్, ఐకేపీ ఏపీఎం సాయిలు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళకు వీల్‌చైర్ అందజేత

సుభాష్‌నగర్, జూన్ 27: అర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు నగర మేయర్ దండునీతూకిరణ్ వీల్‌చైర్‌ను అందజే శారు. నగరంలోని పోచమ్మగల్లిలో గత కొంతకాలంగా అర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్న హారతి అనే మహిళకు లయన్స్‌క్లబ్ వారి సహకారంతో వీల్‌చైర్‌ను అందజేశారు. వీల్‌చైర్‌తో పాటు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొంత కాలంగా మంచానికే పరిమితమైన హారతికి వీల్‌చైర్‌ను అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. హారతి కుటుంబ సభ్యులు లయన్స్‌క్లబ్ సభ్యులు, నగర మేయర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



వీల్‌చైర్‌ను అందజేస్తున్న మేయర్

టీయూలో సెంట్రల్ వర్సిటీ
వీసీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిచ్‌పల్లి,జూన్ 27: తెలంగాణ యూనివర్సిటీలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ వీసీదిష్టి బొమ్మదహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. నాయకుల హక్కుల కోసం నిరసన తెలిపినందుకు ఎస్ఎఫ్ఐ యూనియన్ ప్రెసిడెంట్‌ను ఐదుగురు విద్యార్థులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సస్పెన్షన్‌కు గురైన విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని వర్సిటీలో పెరుగుతున్న నిరంకుశత్వానికి నిదర్శనమని, విద్యార్థులపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐనాయకులు చిత్రు, దినేశ్, అరవింద్, క్రిష్ణ, రాకేశ్, రోషన్, పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్‌రూరల్,జూన్27: పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలో గల చౌడారెడ్డి నివాసంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరయ్య తెలిపిన ప్రకారం జూన్ 18న ఇంటి యాజమాని చౌడారెడ్డి ఇతర గ్రామానికి వెళ్లాడని గురువారం బోధన్‌కు వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి సామాన్లు అని చిదరవందరగా పడిఉన్నాడయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. చౌడారెడ్డి నివాసంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయన్నారు. చౌడారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని, సీసీ ఫుటేజీల ద్వారా త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పున:ప్రారంభించాలి

బోధన్‌రూరల్,జూన్27: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట గురువారం ఫ్యాక్టరీ కార్మికసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పున:ప్రారంభించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పున:ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, దానికి అనుగుణంగా కమిటీ నియమించడం మంచి పరిణామంగా భావిస్తున్నామన్నారు. సీఎం ఢిల్లీ నుంచి రాగానే ఆయనను కలిసి ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరడానికి నిశ్చయించుకున్నామన్నారు.



గేటు ఎదుట మాట్లాడుతున్న నాయకులు

నేడు సారంగపూర్ ఆలయ పార్కింగ్‌కు బహిరంగ వేలం

నిజామాబాద్ అర్బన్, జూన్ 27: సారంగపూర్ హనుమాన్ ఆలయంలో టెంకాయలు అమ్ముకునేందుకు ఒక సంవత్సరం కాలపరిమితితో, రాబోయే శ్రావణమాసం సందర్భంగా నెలపాటు వాహన పార్కింగ్‌ను చూసుకునేందుకు వేలం నిర్వహించనున్నారు. శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

నీటిపారుదల శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌గా గైనీ గంగారాం



బాధ్యతలు స్వీకరిస్తున్న గైనిగంగారాం

నిజామాబాద్ అర్బన్, జూన్ 27 : నీటిపారుదల శాఖ నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ కార్యాలయ సూపరింటెండెంట్‌గా గైనిగంగారాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డీఈఈ భీమ్యా నాయకుడిని కలిసి ఆయన జాయినింగ్ లెటర్‌ను అందజేశారు. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయ నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన గైనిగంగారాంనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తుల స్వీకరణ

సుభాష్‌నగర్, జూన్ 27 : గృహజ్యోతి పథకం కోసం నగరపాలక సంస్థ అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు ఆరుజోన్‌లలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తుల కోసం నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల నుంచి గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తుదారులు బారులు తీరారు. నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు ఉండగా విద్యుత్ శాఖ పరంగా మూడు ఏడీఈ సెక్షన్‌లున్నాయి. వీటితో పాటు విలీన గ్రామాలు సైతం నగర పాలక సంస్థలో కలిశాయి. దీనికోసం నగరపాలక ఉన్నతాధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నాందేవ్‌వాడలో జోన్-1, హమాల్ వాడిలో జోన్-2, పెద్దబజార్‌లో జోన్-3, రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జోన్-4, జోన్-4బి కంఠేశ్వర్, జోన్-5 అర్సపల్లితో పాటు నగర పాలక సంస్థలో దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం
భద్రతా వారోత్సవాలు

సుభాష్‌నగర్, జూన్ 27: విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం జూన్ 26 నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ రాజు అంతటి తెలిపారు. విద్యుత్ భద్రత వారో త్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు ప్రమాదాలు జరుగకుండా ఎలా వ్యవహరించాలో తెలప నున్నామని అన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని అన్నారు. ఎలక్ట్రికల్ పనులు లైసెన్సు కాంట్రాక్టర్ ద్వారా మాత్రమే చేయాలన్నారు. ఎలక్ట్రిక్ వైర్లు తదితర వస్తువులు ఐఎస్ఐ మార్క్ ఉన్నవాటిని మాత్రమే వినియోగించాలన్నారు. విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తిని వెంటనే ప్రథమ చికిత్స సీపీఆర్ చేయాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో తెగిన విద్యుత్ వైర్లను తాకరాదని విద్యుత్ నియంత్రికలు ఎర్త్ పిట్స్ దగ్గరికి వెళ్లరాదన్నారు. బట్టలను విద్యుత్ వైర్లపైన, పరికరాల పైన ఆరవేయ రాదన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో ప్రతిఒక్కరూ భాగం కావాలన్నారు.

ప్రమాదవశాత్తు బెహరాన్‌లో కెకె తండా వాసి మృతి

ఇందల్వాయి, జూన్ 27: మండలంలోని కొత్తకోరుట్ల తండాకు చెందిన బాదావత్ రాజు (30) అనే యువకుడు బెహరాన్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రాజు మూడుసంవత్సరాల నుండి బెహరాన్ దేశం వెళ్లి వస్తున్నాడని, ఒకసారి సెలవుపై వచ్చి వెళ్లినట్లు తెలిపారు. బెహరాన్‌లోని మున్సిపాలిటీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు కింద పడి మృతి చెందాడని తెలిపారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

ఇందల్వాయి, జూన్ 27: ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కోటరాజన్న అనే వ్యక్తి ప్రమాదవశాత్తు తన ఎడమకాలు ఫ్యాక్చర్ కావడంతో ఆసుపత్రిలో కాలును పూర్తిగా తొలగించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం ఆసుపత్రికి వెళ్లి బాధితుడు రాజన్నను పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం

మోపాల్, జూన్ 27: ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రమేష్ మహిళలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని గురువారం మండల సమైక్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పంపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా డ్వాక్రా ప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.

పురుగులు పట్టిన బియ్యాన్ని మార్చిన అధికారులు

నవీపేట,జూన్27: మండలంలోని మద్దెపల్లి యుపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో ఇటీవల తెల్లపురుగులు రాగా సంబంధిత బియ్యాన్ని మార్చి మంచి బియ్యాన్ని బుధవారం సాయంత్రం అందించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ తెలిపారు.

రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు

నవీపేట,జూన్27: మండలంలోన్ని వివిధ గ్రామాల్లోని బీటీ, సీసీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ యాదగిరి గౌడ్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను రోడ్లపై నడిపితే 10వేల రూపాయల జరిమాన విధించడంతో పాటు కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేజీవీల్స్‌కు పట్టీలు అమర్చుకుని ట్రాక్టర్లను నడపాలని ఆయన సూచించారు.

బాధితులకు సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఖిల్లా, జూన్ 27 :వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను బాధితు లకు అందించినట్లు మూడోటౌన్ ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. సెల్‌ఫోన్ పోగొ ట్టుకున్న విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సంబంధించిన వారికి అందించినట్లు తెలిపారు. 10 సెల్‌ఫోన్‌లు గుర్తిం చడంలో ప్రతిభకనబర్చిన మహిళ పోలీస్ సుమలతను సీఐ నరహరి అభినం దించినట్లు తెలిపారు.

అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌టౌన్, జూన్27: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో భారతీయ జనత యువ మోర్చ ఆధ్వర్యంలో గురువారం ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భారత దేశ పార్లమెంట్ సాక్షిగా పాలస్తీనకు జై అన్న ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని పార్లమెంట్ సభ్యుడిగా తొలగించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, ఆకుల శ్రీనివాస్, పులి యుగంధర్, విజయానంద్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మోర్తాడ్ : గెస్ట్‌లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

నగరంలో సైబర్ నేరస్తుడి అరెస్ట్

ఖిల్లా, జూన్ 27 : పోలీసు కమిషనర్ పరిధిలో గల సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్‌లో హనీ ట్రాప్ చేసి డబ్బులు కాజేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపర్చగా కోర్టు జైలుకు పంపినట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఒక ప్రకటనలో తెలిపారు. మగవ్యక్తి గొంతు మార్చి బాధితుడితో మాట్లాడుతూ అతన్ని భయభ్రాంతులకు గురి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అదే విధంగా అతన్ని మాయమాటలు చెప్పి మోసం చేసి డబ్బులు కాజేసినట్లు పోలీసులు గుర్తించారన్నారు. సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్‌లో గురువారం హనీట్రాప్‌కు సంబంధించిన నేరములో నిందితుడ్ని పట్టుకుని జైలుకు తరలించామన్నారు. సైబర్‌క్రైమ్‌కు గురి అయినట్లు అనుమానం ఉంటే వెంటనే 1930కు కాల్ చేసి వివరాలు తెలిపి, పిటిషన్ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఒక వేల 1930నంబర్‌కు వేయిటింగ్ వచ్చిన యెడల సైబర్‌క్రైమ్ లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.

యువకుడిపై ఫొక్సో చట్టం కింద కేసు నమోదు

బోధన్‌రూరల్,జూన్27: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రుద్రూరు మండలానికి చెందిన ఓ యువకుడు ప్రేమపేరుతో మోసం చేశాడని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు ప్రేమపేరుతో తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

'గెస్ట్‌హౌస్ స్థలాన్ని ఎమ్మెల్యే కాపాడాలి'

సిరికొండ జూన్ 27 : మండల కేంద్రంలో ప్రభుత్వ అతిథి గృహానికి కేటాయించిన స్థలాన్ని కొట్టేయడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాస్టర్‌ప్లాన్ వేశారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ అన్నారు. సిరికొండలో గురువారం మాట్లాడుతూ సిరికొండలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని మాస్టర్‌ప్లాన్ వేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చొరువ చూపించి ప్రభుత్వ స్థలాలను కబ్జా కాకుండా చూడాలని రమేష్ కోరారు. సిరికొండలో కబ్జాకు గురవుతున్న స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకోవాలని, తమ పార్టీతో రియల్ వ్యాపారులకు ఎలాంటి సంబంధం లేద ని ప్రకటిం

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72700	రూ.67,000	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్క్రీన్-2 : కల్కి(3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
: మహారాజ (4.10)
స్క్రీన్-4 : కల్కి(తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి(హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (11.20, 2.55, 6.30, 10.05)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.00)
స్క్రీన్-3 : కల్కి(3డి తెలుగు) (11.50, 3.25, 7.00, 10.35)

దేవి : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్